కరీంనగర్‌లో లక్ష ఓట్లతో గెలుస్తాం..

- రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్, మార్చి 23: కరీంనగర్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ లక్ష మెజార్టీతో గెలవడం ఖాయమని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కేసీఆర్‌కు ఓటేసేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క ఎకరం అయినా పంట ఎండిందా.. రైతుబంధు ఆగిందా.. కరెంట్ సరఫరా నిలిచిందా.. అని ఆలోచించాలని కోరారు. కానీ కేసీఆర్ దిగిపోగానే కరెంట్ బందయింది, రైతుబంధు ఆగిపోయింది. పంటలు ఎండిపోతున్నాయని చెప్పారు. శనివారం కరీంనగర్‌లోని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని తెలిపారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా కేసీఆర్ కంటే ఎక్కువ ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చినట్లు చూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడ నోటిఫికేషన్ ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చిందో చెప్పాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన ఉద్యోగ పరీక్షలకు సంబంధించి నియామక పత్రాలు ఇచ్చి తామే ఉద్యోగాలు ఇచ్చామని కాంగ్రెస్ వాళ్లు చెప్పుకొనేందుకు సిగ్గు ఉండాలన్నారు. రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ట్విట్‌లో గతంలో పేపర్‌కు రూ.400 ఉండగా ఇప్పుడు వెయ్యి చేశారని, వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, బీఆర్ఎస్ నగరాధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు దూలం సంపత్‌గౌడ్, రేణుక పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

హుజూరాబాద్ టౌన్, మార్చి 23: పట్టణానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పంజాల కుమారస్వామి సోదరుడు తిరుపతి గౌడ్ ఇటీవల మృతి చెందగా, శనివారం బాధిత కుటుంబ సభ్యులను హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పరామర్శించారు. ముందుగా తిరుపతిగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు

రామడుగు (చొప్పదండి), మార్చి 23: రామడుగు మండలం వెలిచాల గ్రామంలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నిత్యహోమం, బలిహరణం, డోలోత్సవం, బండ్లు తిరుగుట నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ వీర్ల సరోజన, భక్తులు పాల్గొన్నారు.

అబద్ధాలాడే నాయకుడు కావాలా ?

అభివృద్ధి చేసే నాయకుడు కావాలా ?

- అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్
- ఐదేళ్లలో బండి సంజయ్ నయా పైసా తేలేదు
- బీఆర్ఎస్ చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పన్యాల భూపతిరెడ్డి

నాయకులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పన్యాల భూపతిరెడ్డి

గంగాధర, మార్చి 23: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే నాయకుడు కావాలా?, అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే నాయకుడు కావాలో ? ప్రజలు ఆలోచన చేయాలని బీఆర్ఎస్ చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పన్యాల భూపతిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మధురానగర్‌లో శనివారం ఆయన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పన్యాల భూపతిరెడ్డి మాట్లాడుతూ, అబద్ధాలతో కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ పార్టీ హామీలను నమ్మి ప్రజలు ఓటు వేసి, మోసపోయి గోసపడుతున్నారని గుర్తు చేశారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నియోజకవర్గ అభివృద్ధికి నయాపైసా తీసుకురాలేదన్నారు. మతాలు, కులాల పేరుతో ప్రజలను రెచ్చగొట్టడమే తప్ప సంజయ్ చేసిందేమీ లేదన్నారు. కరీంనగర్‌కు స్మార్ట్ సిటీ, కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్, జాతీయ రహదారులను తీసుకువచ్చి, అభివృద్ధి చేసిన ఘనత మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌కే దక్కుతుందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జడ్పీటీసీ రాంమోహన్‌రావు, సింగిల్ విండో చైర్మన్లు దూలం బాలాగౌడ్, మెన్నేని రాజనర్సింగరావు, ఐల్నేని సాగర్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు మేచినేని నవీన్‌రావు, పులి వెంకటేశ్‌గౌడ్, వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, జనగం శ్రీనివాస్, కత్తెరపాక కొండయ్య, మాజీ సర్పంచులు పునుగోటి కృష్ణారావు, కంకణాల విజేందర్‌రెడ్డి, ముక్కెర మల్లేశం, కర్ర శ్రీనివాస్‌రెడ్డి, గండ్ల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలి

కలెక్టరేట్, మార్చి 23: యువత మారుతున్న సాంకేతికతపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని చైల్డ్ హెల్ప్‌లైన్ కో–ఆర్డినేటర్ ఆవుల సంపత్ సూచించారు. నగరంలోని బ్యాంక్ కాలనీలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజనలో భాగంగా నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. ఈ క్రమంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించగా, ఆవుల సంపత్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సెంటర్ మేనేజర్ మమత, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది సాయికిరణ్, జ్యోతి, రాములు, అనూష, హరిప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, మార్చి 23: కొత్తపల్లిలోని సచ్చిదానంద ఆశ్రమం ఆవరణలో చిన్న గుట్ట పైన నిర్మించిన ఆలయంలో ఈ నెల 24న వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ రాజభాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి, మనోహరాచారి తెలిపారు. నగరంలోని ప్రెస్ భవనంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు మధుసూదన్, సత్యనారాయణ, శ్రీహరిరెడ్డి, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు

కరపత్రం ఆవిష్కరణ

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంగుల, మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, మార్చి 23: అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో చేపట్టే అంబేద్కర్ భీమ్ యాత్రకు సంబంధించిన కరపత్రాన్ని నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ శనివారం మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఏప్రిల్ 14న సాయంత్రం 4.30 గంటలకు కిసాన్ నగర్ నుంచి కోర్టుచౌరస్తా వరకు భీమ్ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, నాయకులు కొమ్ముల కరుణాకర్, గసికంటి దీపక్, మాతంగి సుమిత్, ఆసంపెల్లి వినయ్ సాగర్, దాసరి సాయిచరణ్, తాండ్ర రాకేశ్, ఎనగందుల కళ్యాణ్, వంశీ, ఇటుకల డేవిడ్, కటుకూరి శ్రీకృష్ణ, జయాకర్, చంటి, అజయ్, ప్రభాస్, రతన్, గణేశ్, శేఖర్, సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోషణ్ పక్షోత్సవాలు

కలెక్టరేట్, మార్చి 23: మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న పోషణ్ పక్షోత్సవాలు శనివారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు అక్షరాభ్యాసం, వారి తల్లులకు పోషకాహారం గురించి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, చైతన్యపరిచినట్లు జిల్లా సంక్షేమాధికారి ఎం సరస్వతి తెలిపారు. పక్షోత్సవాల్లో నిర్వహించిన కార్యక్రమాల వివరాలను సూచించే ఆన్‌లైన్ సైట్‌లో రాష్ట్రస్థాయిలో జిల్లా మొదటిస్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు.

జైలులో న్యాయ విజ్ఞాన సదస్సు

రాంనగర్, మార్చి 23: జిల్లా జైలును శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే వెంకటేశ్ సందర్శించారు. జైలులో ఖైదీల యోగ క్షేమాలు, భోజన వసతులు, న్యాయ సేవ, ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. జైలులో క్యాంటీన్, దవాఖాన, ఫోన్ సౌకర్యం, లైబ్రరీ, జైలు ఇండస్ట్రీలో చేపడుతున్న పనులను చూసి అధికారులను అభినందించారు. అలాగే, మహిళా జైలును కూడా సందర్శించారు. కార్యక్రమంలో జైలు పర్యవేక్షణాధికారి కే శ్రీనివాస్, జైలర్ శ్రీనివాస్, డిప్యూటీ జైలర్లు శ్రీనివాస్ రెడ్డి, రమేశ్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లాయర్ తణుకు మహేశ్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం

తిమ్మాపూర్ రూరల్, మార్చి 23: మొగిలిపాలెంలో శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవాన్ని శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం నుంచి జాజాల మోహన్ రావు దంపతులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలను తీసుకువచ్చారు. కార్యక్రమంలో అర్చకుడు చంద్రమోహన్, ప్రజాప్రతినిధులు, సేవాదళ్ కార్యకర్తలు, దేవస్థాన ధర్మకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు నివాళి

హుజూరాబాద్‌టౌన్/ తెలంగాణచౌక్, మార్చి 23: భగత్‌సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా హుజూరాబాద్ పట్టణంలో ఆయన చిత్రపటానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాముయాదవ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు దోమ్మటి వేణుగోపాల్, జూపాక శివమణి, నాయకులు పాల్గొన్నారు. కరీంనగర్‌లోని భగత్ సింగ్ విగ్రహానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు హేమంత్, సందీప్‌రెడ్డి, వినయ్, సాయి, అనిరుధ్ పాల్గొన్నారు. నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో భగత్ సింగ్ చిత్రపటానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు అరవింద్, నరేశ్‌పటేల్, రఘుపతి పాల్గొన్నారు.

అలరించిన గాజుల నందన్ స్మారక భజన పోటీలు

శంకరపట్నం/చొప్పదండి, మార్చి 23: వంకాయగూడెంలోని అయ్యప్ప కాలనీలో శుక్రవారం రాత్రి నిర్వహించిన గాజుల నందన్ స్మారక భజన పోటీలు అలరించాయి. జిల్లా నలుమూలల నుంచి 31 భజన మండళ్లకు చెందిన భజన బృందాలు పాల్గొన్నాయి. శుక్రవారం రాత్రి 8 గంటల నుంచి శనివారం తెల్లవారుజాము వరకు భజన బృందాల పాటలు శ్రోతలను ఉర్రూతలూగించాయి. ఈ పోటీల్లో చొప్పదండికి చెందిన శ్రీహనుమాన్ భజన మండలి ప్రథమ స్థానంలో నిలువగా, రూ. 10,116 నగదు, మెమెంటో అందజేశారు. ఎరడపల్లికి చెందిన శ్రీరామానంద భజన మండలి ద్వితీయ బహుమతి సాధించగా, వీరికి రూ.8,116 నగదు, మెమెంటో అందజేశారు. అలాగే కరీంనగర్‌కు చెందిన శ్రీషిరిడీ సాయి భజన మండలి తృతీయ బహుమతి గెలుచుకోగా రూ.5116 నగదు, మెమెంటో అందజేశారు. బెస్ట్ డోలక్‌గా ఎరడపల్లికి చెందిన సదానందం, ఉత్తమ గాయకుడిగా చొప్పదండికి చెందిన చీకట్ల లచ్చయ్య ఎంపికయ్యారు. అలాగే పోటీల్లో పాల్గొన్న సభ్యులందరికీ నందన్ కుటుంబ సభ్యులు కన్సోలేషన్ అవార్డులతో పాటు మెమెంటోలు ఇచ్చి, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్, హనుమాన్ టెంపుల్ వ్యవస్థాపక అధ్యక్షుడు తనుకు ఓంకారం, గాజుల వెంకటేశ్వర్లు, భూపతి నాగభూషణం, వంగ సత్యనారాయణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఔదార్యాన్ని చాటిన ఆర్ఎంపీలు

వీణవంక, మార్చి 23: కిష్టంపేటకు చెందిన ఆర్ఎంపీ బొడ్డుల సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబానికి మండలంలోని ఆర్ఎంపీలు ఆర్థిక సాయం అందజేసి ఔదార్యాన్ని చాటారు. తలా కొంత విరాళాలు వేసుకొని రూ.30 వేలు జమచేసి, శనివారం సత్యనారాయణ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మండల ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

చెట్లను మేమే తొలగించాం

పోలీస్ స్టేషన్‌లో ఆముదాలపల్లి వాసుల సమాచారం

శంకరపట్నం, మార్చి 23: విద్యుత్ తీగల కింద ప్రమాదకరంగా ఉన్న చెట్లను తామే తొలగించామని ఆముదాలపల్లి గ్రామస్తులు శనివారం కేశవపట్నం పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇచ్చారు. గత నెల 16న ఆముదాలపల్లిలో కొందరు రోడ్డు పక్కన విద్యుత్ లైన్ల కింద ఉన్న హరితహారం చెట్లను తొలగించారు. ఇటీవల డీపీవో చూసి పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సిబ్బంది చెట్లు తొలగించారనే సమాచారం మేరకు కార్యదర్శి హరీశ్ రెండు రోజుల క్రితం ఆముదాలపల్లి సబ్ స్టేషన్ ఏతః కుమారస్వామిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, ఈ ఘటనపై ఆముదాలపల్లి గ్రామస్తులు కొందరు చెట్లను తామే తొలగించామని పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వగా, ఈ ఘటనపై దర్యాప్తు చేస్తామని ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

సాగు నీటి కోసం రైతుల తండ్లాట

తాడిజెర్రి వద్ద వరద కాలువలో గుంత తీస్తున్న ఎక్స్‌కవేటర్

గంగాధర, మార్చి 23: మండలంలోని కొండన్నపల్లి, తాడిజెర్రి, గర్శకుర్తి, రంగరావుపల్లి గ్రామాల పరిధిలో వరదకాలువపై ఆధారపడి రైతులు పంటలు సాగు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వరద కాలువకు నీటిని విడుదల చేయకపోవడంతో నీళ్లు అడుగంటి మోటర్లు పైకి తేలాయి. పొట్టదశలో ఉన్న వరి పొలాలకు సాగునీరందే పరిస్థితి లేకపోవడంతో పంటలను కాపాడుకోవడానికి రైతులు ఎక్స్‌కవేటర్ల సహాయంతో కాలువలో పెద్ద గుంతలు తవ్వించి పంటలకు నీరందిచుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. శనివారం సాయంత్రం తాడిజెర్రి వద్ద కొందరు రైతులు వరద కాలువలో ఎక్స్‌కవేటర్లతో గుంతలు తీశారు. సర్కారు స్పందించి వరదకాలువకు నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలి

తెలంగాణచౌక్, మార్చి 23: ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ వినోద్‌కుమార్ ఆదేశించారు. నగరంలోని బస్టాండ్ కాంప్లెక్స్‌లో గల ఈడీ కార్యాలయంలో శనివారం జోనల్ పరిధిలోని రీజియన్ మేనేజర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రీజియన్ పరిధిలోని డిపోల వారీగా లాభనష్టాలను అంచనా వేయాలన్నారు. నష్టాల్లోంచి సంస్థను లాభాల బాటలోకి తీసుకరావడానికి చేపట్టే చర్యలను వివరించారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించాలని సూచించారు. బస్సులకు అవసరమైన మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. మేడారం, శివరాత్రి జాతరలను విజయవంతం చేసినందుకు అధికారులను అభినందించారు. ఈ సమావేశంలో రీజనల్ మేనేజర్లు సుచరిత (కరీంనగర్), సాలమన్ (ఆదిలాబాద్), వెంకన్న (ఖమ్మం), శ్రీలత (వరంగల్), జానీరెడ్డి (నిజామాబాద్), డిప్యూటీ ఆర్ఎంలు భూపతిరెడ్డి, సత్యనారాయణ, జోనల్ వర్క్‌షాపు మేనేజర్ సుగుణాకర్, ఈడీ కార్యదర్శి యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కిట్స్ కళాశాల సాంస్కృతిక వార్షికోత్సవంలో సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినులు

ముగిసిన సాంస్కృతిక వార్షికోత్సవం

హుజూరాబాద్ రూరల్, మార్చి 23: సింగాపూర్ గ్రామంలోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న సాంస్కృతిక వార్షికోత్సవం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ వస్త్రాల్లో మెరిశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎన్ హనుమకుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, భారతీయ సంస్కృతీసంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు గాజుల శారద, రజిత, కోమల, అజయ్, పీడీ విజయ్ కుమార్, గణేశ్, తిరుపతి, సదానందం, అశోక్, సతీశ్ కుమార్, హరీశ్ రావు, భాస్కర్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన రెడ్డి సంఘం నాయకులు

సీఎం రేవంత్‌రెడ్డిని సత్కరించి పుష్పగుచ్ఛం అందిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

తెలంగాణచౌక్, మార్చి 23: సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని నివాసంలో శనివారం ఆర్‌బీవీఆర్‌ఆర్ రెడ్డి సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి బండ గోపాల్‌రెడ్డి, కోశాధికారి కాసర్ల మధుకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మహేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులు దారం జగన్నాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

హుజూరాబాద్ టౌన్, మార్చి 23: ఓటర్లందరూ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ సమ్మయ్య సూచించారు. శనివారం పట్టణంలో ఓటర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతన ఓటర్లు వచ్చే నెల 14లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో మహిళలు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెప్మా డీఎంసీ శ్రీవాణి, సీఎల్ఆర్పీలు రమాదేవి, అనూష, ఆర్పీలు, ఓబీలు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గన్నేరువరం, మార్చి 23: ఖాసీంపేట గ్రామంలో 83.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం శనివారం అక్రమంగా తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి పట్టుకున్నట్లు ఎస్ఐ తాండ్ర నరేశ్ తెలిపారు. బియ్యాన్ని సివిల్ సప్లై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కమలేష్, నాయబ్ తహసీల్దార్ నరేందర్ స్వాధీనం చేసుకొని కరీంనగర్‌లోని గోదాంకు తరలించారు. రాజుపై కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వాగేశ్వరిలో టీసీఎస్ వర్క్‌షాప్

తిమ్మాపూర్, మార్చి23: రామకృష్ణకాలనీలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ సీఎస్సీ విభాగం ఆధ్వర్యంలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు 'ఎంపవర్ యువర్ ఫీచర్, ఎంప్లాయిబిలిటీ స్కిల్' అంశంపై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీసీఎస్ డిజైనర్ హెడ్ పూర్ణచందర్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ వినోద్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, హెచ్‌వోడీలు డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, చంద్రమౌళి, వెంకట్ రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన ర్యాలీ

హుజూరాబాద్‌టౌన్, మార్చి 23: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం సందర్భంగా చెల్పూర్ పీహెచ్‌సీ, హుజూరాబాద్ పట్టణ వైద్య ఆరోగ్యశాఖ వైద్యులు, సిబ్బంది శనివారం పట్టణంలోని ఏరియా దవాఖాన నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు పాల్గొని మాట్లాడుతూ, రెండు వారాల కంటే ఎక్కువ దగ్గు, జ్వరం క్షయ లక్షణాలుంటే, అలాంటి వారు హుజూరాబాద్ ప్రాంతీయ దవాఖానలో తెమడ పరీక్ష చేసుకోవాలని సూచించారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్స్ రఘోత్తంరెడ్డి, జలంధర్, హుజూరాబాద్ డివిజన్ హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, క్షయ నియంత్రణ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కొత్తపల్లి, మార్చి 23: ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన క్రీడాకారులు సాయికృష్ణ, ఎం చంద్రదీప్, ఎం చంటి జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ పేర్కొన్నారు. శనివారం క్రీడాకారులను జిల్లా క్రీడాధికారులు, క్రీడా సంఘాల బాధ్యులు అభినందించారు.

నవాబ్ పేట్‌లో కేంద్ర బలగాల కవాతు

చిగురుమామిడి, మార్చి 23: సీపీ ఆదేశాల మేరకు నవాబుపేట్ గ్రామంలో కేంద్ర బలగాలు శనివారం కవాతు నిర్వహించాయి. కార్యక్రమంలో ఎస్ఐ బండి రాజేశ్, పోలీసులు, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

'కిట్స్' అధ్యాపకుడికి డాక్టరేట్

హుజూరాబాద్ రూరల్, మార్చి23: మండలంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో భౌతిక శాస్త్ర అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న కట్ట రాజశేఖర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ప్రొఫెసర్ జే లక్ష్మణ్ నాయక్ పర్యవేక్షణలో 'ఇన్వెస్టిగేషన్ ఆఫ్ స్ట్రక్చరల్ మాగ్నెటిక్ అండ్ ఎలక్ట్రికల్ ప్రాపర్టీస్ ఆఫ్ రేర్ ఎర్త్ డోప్డ్ నికెల్ కాపర్ నానోఫెరైట్స్' అంశంపై రాజశేఖర్ చేసిన పరిశోధనకు గానూ పీహెచ్‌డీ ప్రకటించినట్లు ఉస్మానియా యూనివర్సిటీ అడిషనల్ కంట్రోలర్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ సీపీ వర్ధాని తెలిపారు. రాజశేఖర్‌కు డాక్టరేట్ రావడంపై కళాశాల సెక్రటరీ వీ సతీశ్ కుమార్, హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ వీ రాజేశ్వర రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కే ఈశ్వరయ్య, డైరెక్టర్ డాక్టర్ కే శంకర్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

సభ్యుల సహకారంతోనే సంఘ అభివృద్ధి

మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మన్ బిల్ల వెంకటరెడ్డి

సైదాపూర్, మార్చి23: సభ్యులందరి సహకారంతోనే సంఘం అభివృద్ధి చెందుతున్నదని వెన్నంపల్లి సింగిల్‌విండో చైర్మన్ బిల్ల వెంకటరెడ్డి పేర్కొన్నారు. శనివారం వెన్నంపల్లి సింగిల్‌విండో కార్యాలయంలో మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సభ్యులకు అవసరమైన రుణాలు ఇవ్వడంతో పాటు సంఘం ద్వారా ఎరువులు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. సభ్యులు సంఘం సేవలను వినియోగించుకోవాలని సూచించారు. వైస్ చైర్మన్ గుండేటి శ్రీనివాస్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ సారబుడ్ల రాజిరెడ్డి, డైరెక్టర్లు, సీఈవో, సిబ్బంది ఉన్నారు.

మెస్ బిల్లులు సత్వరమే చెల్లించాలి

కలెక్టరేట్, మార్చి 23: బీసీ సంక్షేమ వసతి గృహాలకు పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు వెంటనే చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు సిరిశెట్టి ర